Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 68 | Satureday 08.02.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 68 | శనివారం 0802. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4





విధ్వంసమైన వ్యవస్థలను...

## గాడిలోపెడుతున్నాం

### ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు... ఎవరినీ తక్కువ చేయడానికి కాదు: సీఎం చంద్రబాబు

### ప్రథమ స్థానంలో ఫరూఖ్... చివరిస్థానంలో వాసంశెట్టి సుభాష్

### చంద్రబాబుకు 6వ ర్యాంకు - నేనుకూడా మెరుగుపడాల్సి ఉందని అంగీకరించిన చంద్రబాబు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ మంత్రుల పనితీరు ఆధారంగా సీఎం చంద్రబాబు ర్యాంకింగ్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో సీఎం చంద్రబాబుకు 6వ స్థానం లభించింది. ఈ క్రమంలో శుక్రవారం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రులకు దిశానిర్దేశం చేశారు. తాను కూడా మెరుగుపడాల్సి ఉందని నిజాయతీగా అంగీకరించారు. ఈ ర్యాంకులు విడుదల చేసింది ఒకరు గొప్ప, మరొకరు తక్కువ అనే ఉద్దేశంతో కాదని స్పష్టం చేశారు. "ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారు. వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నాం. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే...

మిగతా 2 లో

మీ పని...

## బాగుంది.

ప్రశంసలతో ముంచెత్తిన పవన్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. 195 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపీ అటవీ శాఖ, రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని అన్నారు. అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న 8 మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక

మిగతా 2 లో

మహారాష్ట్ర ఓటర్ల జాబితాల్లో భారీగా...

## అవకతవకలు

ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ తీవ్ర అగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సంఘం తీరుతో మహారాష్ట్ర ఓటర్ల జాబితాల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలప్పుడు లేని 39 లక్షల మంది ఓటర్ల పేర్లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలప్పుడు జాబితాల్లోకి వచ్చాయని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో ఆ 39 లక్షల మంది ఓటర్లు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ ఆప్ ఇండియాలో ఉద్ధవవ్ థాకరే శివసేన ఎంపి సంజయ్ రౌత్, శరద్‌పవార్ ఎన్సీపీ ఎంపి సుప్రియా సులేతో కలిసి ఏర్పాటుచేసిన జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల కంటే ముందు ఐదేళ్ల కాలంలో పెరిగిన ఓటర్లకు సమానంగా కేవలం గత ఐదునెలల్లోనే పెరిగారని, ఇది ఎలా జరిగిందో ఎన్నికల సంఘం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని మహారాష్ట్ర

మిగతా 2 లో

## శవం లేస్తే కానీ బయటకు రాని... దుర్మార్గుడు జగన్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పిచ్చి జగన్.. సైకో జగన్‌గా మారడమే జగన్ 2.0 అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి విమర్శించారు. శవం లేస్తే కానీ బయటకు రాని దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని ఆరోపించారు. వైఎస్ విజయలక్ష్మి, షర్మిల ఆయుష్షు గట్టిది కాబట్టే జగన్‌కు దూరంగా ఉంటున్నారని చెప్పారు. జగన్ తీరు మారకుంటే.. ప్రజలే జగన్‌ను ఏపీ నుంచి బయటకు గెంటుతారని అన్నారు. ప్రజలు తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టిడించే పరిస్థితిని.. జగన్‌రెడ్డి

మిగతా 2 లో

ఎన్డీఏ అభ్యర్థి రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా...

## అందరం పనిచేయాలి

: మంత్రి నారాయణ దిశానిర్దేశం



కాకినాడ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎన్డీఏ నేతలతో కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ శుక్రవారం ఉదయం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి కాకినాడ జిల్లా ఎమ్మెల్యే

మిగతా 2 లో

పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్ విధానం అమలుకు...

## ప్రభుత్వం చర్యలు

### పి-4 విధానంపై అధికారులతో సీఎస్ సమీక్ష - పేదరిక నిర్మూలనే లక్ష్యమని సీఎస్ విజయానంద్ వెల్లడి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఉగాది నుండి పి-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్) విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వెల్లడించారు. పి-4 విధానంపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులు, వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి

మిగతా 2 లో



సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ...

## పాలనపై లేదు

: కేటీఆర్ ఆగ్రహం..

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగా అందడం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారంటే, ఇక మంత్రుల నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో

మిగతా 2 లో

విశ్వసనీయత వున్నవాడినికాబట్టే...

## ఎవరికీ లొంగలేదు

జగన్‌కు విజయసాయి కౌంటర్...!



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ మాజీనేత విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత జీవితంలో విలువలు, విశ్వసనీయత వున్నవాడిని కాబట్టే ఎవరికీ, ఎలాంటి ప్రలోభాలకు తాను లొంగలేదని

మిగతా 2 లో

# సంపాదకీయం

## సీఎంగా వర్గానికి కొమ్ము కాస్తారా...

గతేడాది మణిపూర్‌లో జరిగిన అల్లర్లు ఎంతటి హింసకు దారితీశాయో.. ఎన్ని వందల మంది ప్రాణాలను తీసుకున్నాయో.. భారత్ మొత్తం చూసింది. అయితే.. ఆ అల్లర్ల వెనుక ఎవరున్నారు? హింసను ప్రేరేపించింది ఎవరనేదానిపై.. ఆ రాష్ట్ర సీఎం బీరేన్ సింగ్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఆయన పేరుతో ఓ ఆడియో క్లిప్ వైరల్ అవడమే ప్రధాన కారణం. మెయితీలు, కుకీల మధ్య జరిగిన హింసను.. సీఎం బీరేన్ సింగే ప్రేరేపించారని లీకైన ఆడియో క్లిప్ హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాలను లూటీ చేసేందుకు.. మెయితీలకు అవకాశమివ్వండి అంటూ ఆదేశించే ఆడియో క్లిప్ వైరల్ అయింది. దాంతో వివాదం మరింత ముదిరింది.సీఎం బీరేన్ సింగ్ వ్యాఖ్యలతో సంబంధం ఉన్న ఆడియో టేపులు లీక్ అయ్యాయని ఆరోపిస్తూ.. కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దాంతో.. ఈ ఇష్యూని సీరియస్‌గా తీసుకొని సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. లీక్ అయిన ఆడియో క్లిప్‌లను.. హైదరాబాద్‌లోని స్వతంత్ర ఫోరెన్సిక్ ల్యాబ్.. ట్రూత్ ల్యాబ్స్ పరిశీలించింది. అందులోని వాయిస్.. సీఎం బీరేన్ సింగ్ గొంతుతో 93 శాతం మ్యాచ్ అయిందని.. కుకీ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు రిపోర్ట్ ఇచ్చారు. అదే.. ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది.కేంద్రం తరఫున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. ఈ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఆడియో క్లిప్‌పై.. కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్ పరిశీలనకు 3 వారాల గడువు కావాలని కోరారు. ఇలాంటి పిటిషన్ దాఖలు చేయడం వెనుక కుకీ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఉద్దేశాన్ని సైతం ప్రశ్నించారు. వారికి సైద్ధాంతిక ధోరణులు, వేర్పాటువాదుల రకాలు ఉన్నాయని మెహతా వాదించారు. పిటిషనర్ ఉద్దేశం కేవలం ఇప్పుడున్న సున్నితమైన అంశాన్ని మరింత మరిగించడమేనన్నారు. పైగా.. ఈ కేసుని మణిపూర్ హైకోర్టు విచారించాలని ఆయన కోరుతున్నారు. అయితే.. ఈ కేసుని.. తాము విచారించాలా? మణిపూర్ హైకోర్టు విచారించాలా? అనేది తదుపరి విచారణలో నిర్ణయిస్తామని సుప్రీం ధర్మాసనం తెలిపింది.పూర్తి వాదనలు విన్న తర్వాత? సీఎం బీరేన్ సింగ్ ఆడియోకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్ట్ అందించాలని.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ప్రభుత్వ ఫోరెన్సిక్ లాబొరేటరీ అతుటాకు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. వాస్తవానికి.. ఏడాదిన్నర కాలంగా మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.మెయితీలు, కుకీల మధ్య రేగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 250 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ.. ఆ రాష్ట్రం అట్టుడుకుతూనే ఉంది. హింసని నిలువరించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నిస్తోంది. ఓ వైపు సర్కార్ చర్యలు కొనసాగుతున్నా.. హింసను పూర్తిగా అణచివేయడంలో పూరి స్థాయిలో విఫలమవుతున్నారనే అభిప్రాయాలున్నాయి. ఇదే సమయంలో.. హింసను ప్రేరేపించేలా ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌పై ఆదేశాలిచ్చారంటూ వచ్చిన ఆరోపణలు.. ఈ సమస్యని మరింత క్లిష్టంగా మార్చాయి.రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటూ.. హింసాగ్నిని చల్లార్చేందుకు, శాంతిభద్రతల్ని కాపాడేందుకు ప్రయత్నించాల్సిన సమయంలో.. ఓ వర్గానికి కొమ్ము కాస్తూ.. వారి పట్ల సానుకూలతను వ్యక్తం చేయడం, హింసను ప్రేరేపించేలా ఆదేశాలిచ్చారనే ఆరోపణలు.. ఇప్పుడు దేశ రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వైషమ్యాలు, హింస ఏ స్థాయికి చేరాయో అంతా చూశాం. ఇలాంటి సమయంలో.. సీఎం బీరేన్ సింగ్ చర్యలు మరింత హింసను పెంచేలా చేశాయనే వాదనలు వినిపిస్తున్నాయి.పైకి అంతా ప్రశాంతంగానే కనిపిస్తున్నా.. మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది. అక్కడి వాతావరణమంతా.. నివురుగప్పిన నిప్పులానే ఉంది. ఘర్షణలు తగ్గినప్పటికీ.. మెయితీ, కుకీ, నాగ తెగల ప్రజలు కలిసి జీవించాలనే కల.. కొన్ని నెలల కిందటే చెదిరిపోయింది. పరస్పర విశ్వాసం కోల్పోయిన అక్కడి ప్రజలు నిస్సహాయంగా మారారు. హింసాత్మక అల్లర్లు ఆగిపోయి ఏడాదిన్నర దాటినా.. మణిపూర్‌లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఇంకా.. మెయితీలు, కుకీ తెగలు రగిలిపోతూనే ఉన్నాయి. ఇంతలోనే.. సీఎం బీరేన్ సింగ్ పేరుతో ఆడియో క్లిప్ వైరల్ అవడం.. అందులో మెయితీలకు సానుకూలంగా మాట్లాడారనే ఆరోపణలతో.. హీట్ మరింత పెరిగింది. ఈ పరిస్థితుల నుంచి మణిపూర్ ఎప్పటికి బయటపడుతుందన్నదే ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది.మెయితీలు, కుకీ తెగల మధ్య భూమి, పలుకుబడి విషయంలో మొదలైన వివాదం.. రెండు జాతుల మధ్య హింసకు దారితీసింది. అది కాస్తా.. రాష్ట్రాన్ని అగ్నిగుండంలా మార్చేసింది. ఈ భయానక పరిస్థితుల్ని భారత్ మొత్తం చూసింది. ఇప్పటికీ.. మణిపూర్‌లో ఆ రెండు తెగల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఏడాదిన్నర కిందట అక్కడ అల్లర్లు చెలరేగినప్పుడు.. ఇండియన్ ఆర్మీ, పారామిలిటరీ బలగాలు, పోలీసులు.. హింసను ఆపేందుకు ఎంత ప్రయత్నించినా.. ఆ మంటలు చల్లారలేదు. ఆ సమయంలోనే పోలీసుల ఆయుధాల్ని దొంగిలించారు. అలా.. రెండు తెగల మధ్య ఘర్షణ.. మరింత హింసాత్మకంగా మారింది.మణిపూర్‌లో సంక్షోభం తలెత్తేందుకు అనేక కారణాలు ఉన్నాయి. సుమారు 35 గిరిజన తెగలున్నా.. ప్రధాన తెగలు మూడే. అవే.. మెయితీ, కుకీ, నాగ తెగలు. మణిపూర్ మొత్తం జనాభా 33 లక్షలు ఉంటే.. అందులో 53 శాతం మెయితీలే ఉన్నారు. వీరంతా.. రాష్ట్రం మధ్యలోని ఇంఫాల్ లోయలో నివసిస్తున్నారు. పైగా.. మణిపూర్‌లో ప్రభావవంతమైన వర్గంగా ఉన్నారు. ఈ కుకీ, నాగాతో పాటు ఇతర తెగలన్నీ కలిపి.. 47 శాతంగా ఉన్నారు. వీరంతా.. ఇంఫాల్ లోయ చుట్టూ ఉన్న కొండ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రస్తుతం.. ఎస్సీ, ఓబీసీ హోదాతో ఉన్న మెయితీలు, నాగా, కుకీల మాదిరిగానే.. తమకు కూడా ఎస్టీ హోదా కావాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే.. వివాదానికి దారితీసింది. మణిపూర్‌ని అట్టుడికిపోయేలా చేసింది.మెయితీల డిమాండ్‌కు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలపాలని.. మణిపూర్ హైకోర్ట్ ఆదేశించింది. దీనిపై.. అప్పటికి ప్రభుత్వం స్పందించలేదు. ఒకవేళ.. మణిపూర్ సర్కార్ మెయితీలకు సానుకూలంగా స్పందిస్తే.. తమకు నష్టం జరుగుతుందని కుకీ, నాగ తెగలకు చెందిన వారు ఘర్షణ పడటంతో హింస మొదలైందనే వాదనలున్నాయి. ఇప్పటికే.. ప్రభుత్వంలో, సమాజంలో బాగా పలుకుబడి ఉన్న మెయితీల ప్రాబల్యాన్ని మరింత బలోపేతం చేస్తే.. కుకీలు ఎక్కువగా ఉండే కొండ ప్రాంతాల్లో భూములు కొనేందుకు, అక్కడే స్థిరపడేందుకు వారికి అనుమతించినట్లవుతుందని.. కుకీలు వ్యతిరేకిస్తున్నారు.అదీగాక.. 53 శాతం ఉన్న మెయితీల చేతుల్లో 10 శాతం భూమి ఉంటే.. 47 శాతం ఉన్న నాగ, కుకీ, ఇతర తెగల చేతుల్లో 90 శాతం భూమి ఉంది. ఇంఫాల్ లోయలో పెరుగుతున్న జనాభా, తరుగుతున్న వనరులు, నిరుద్యోగం, వలసలు, ఇతర కారణాలతో మెయితీలు కూడా కొండ ప్రాంతాలకు విస్తరించాలనుకుంటున్నారు. కానీ.. ఇప్పుడున్న చట్టాల ప్రకారం ఎస్టీలు మాత్రమే కొండ ప్రాంతాల్లో భూముల్ని కొనుగోలు చేయాలి. అందువల్ల.. తమకు కూడా షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించాలనేది మెయితీల డిమాండ్. దీనిని.. కుకీ, నాగ తెగలు వ్యతిరేకిస్తున్నాయి.కుకీ తెగ ఆందోళనకు ఇతర కారణలూ ఉన్నాయి. మణిపూర్ ప్రభుత్వం డ్రగ్స్‌పై చేపట్టిన యుద్ధంతో.. తమ కమ్యూనిటీలను సమూలంగా నాశనం చేయాలని చూస్తోందని ఆరోపిస్తున్నారు. మయన్మార్ నుంచి పెరిగిన అక్రమ వలసలు కూడా ఉద్రిక్తతల్ని మరింత పెంచాయి. పెరుగుతున్న జనాభాతో.. రాష్ట్రంలో భూ వినియోగంపై ఒత్తిడి పెరిగింది. ఇలా.. అనేక కారణాలున్నాయి. అయితే.. అల్లర్లు చెలరేగిన తర్వాత.. అవి హింసాత్మకంగా మారేందుకు దారితీసిన పరిణామాలేంటనేదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## ఎన్డీఏ అభ్యర్థి రాజశేఖర్ గెలుపే...

కార్పొరేషన్ చైర్మన్‌లు, అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్లు, ఎన్డీఏ నాయకులు హాజరయ్యారు. ఎన్డీఏ అభ్యర్థి రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. రాజశేఖర్‌ను గెలిపించి సీఎం చంద్రబాబు నాయుడుకు బహుమతి ఇద్దామని సూచించారు. ఎమ్మెల్యేలు, నాయకులు తమ తమ తమ నియోజకవర్గాలలో పూర్తిస్థాయిలో ఓటింగ్ పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయగోదావరి జిల్లాలో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో క్వీన్ స్వీప్ చేశామని.. మరోసారి ఆ ఫలితాలు రిపీట్ అవ్వాలని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలో మంచి ప్రభుత్వంగా నిరూపించుకుందని చెప్పుకొచ్చారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం అనేక కంపెనీలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను మరింతగా పట్టభద్రులలోకి తీసుకువెళ్లాలని నాయకులకు మంత్రి నారాయణ సూచించారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మంత్రులు కృషి చేస్తున్నారు. పలు సమావేశాలు నిర్వహిస్తూ నాయకులకు, కార్యకర్తలకు పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ గెలుపు కోసం ఎన్డీఏ కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రాడ్యుయేట్‌లను కలిసి రాజశేఖర్‌ను గెలిపించాల్సిందిగా కోరుతున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకోవడానికి తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం.. ఈ స్థానాన్ని గెలిపించే బాధ్యతలను జిల్లా నేతలకు, శ్రేణులకు అప్పగించింది. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, నారాయణ పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 3 లక్షలకు పైగా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా షూరే అయ్యింది. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 8, 9 తేదీల్లో సెలవు దినాలు ఉన్నాయి. 11న నామినేషన్లను పరిశీలించనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. ఈనెల 27 పోలింగ్ జరుగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మార్చి 3న ఓట్లను లెక్కించనున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ స్థానానికి పోలింగ్ జరగనుంది.

## శవం లేస్తే కానీ బయటకు రాని...




తెచ్చుకోవద్దని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హెచ్చరించారు. ఆత్మలతో మాట్లాడే జగన్ మానసిక పరిస్థితి అందరికీ తెలిసిందేనని విమర్శించారు. లండన్‌లో తెచ్చుకున్న మందులు పని చేయట్లేదని జగన్ మానసిక పరిస్థితి చూస్తే అర్థమవుతోందని అన్నారు. జగన్ మానసిక పరిస్థితికి జాలిపడి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి తాను సిఫార్సు చేస్తానని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ సాయంతోనైనా జగన్ ఓ మంచి డాక్టర్‌కు చూపించుకోవాలని హితవు పలికారు. అబద్ధాల్లో ఆస్కార్ పొందే సైకో జగన్మోహన్ రెడ్డి అని ఆక్షేపించారు. అసెంబ్లీకి వెళ్లి మాట్లాడమని జగన్‌ను ప్రజలు ఎన్నుకుంటే... అసెంబ్లీకి ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. జగన్‌కు పిచ్చి ఏ స్థాయిలో ముదిరిందో అర్థమవుతోందన్నారు. ఐదేళ్లు అసభ్యంగా మాట్లాడిన జగన్ నోట నీతులు విని ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. జగన్‌కు విశ్వసనీయత అనే పదం తెలుగులో రాయటం రాదు, ఇంగ్లీషులో అర్థం తెలీదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ...

సీఎంకు లేదంటూ విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**అసలు విషయం ఇదే.. :** కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నాచారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించడం లేదంటూ పలు వార్తపత్రికలు ప్రచురించాయి. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికలకు వివాదం తలెత్తడంతో పిల్లలకు అన్నం పెద్దలేదన్న వార్తలు వెలువడ్డాయి. కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కార్మికులు అరకొరగా భోజనం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆహారం నాణ్యతా లోపించడంతో వారి పస్తులు ఉంటూ తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారు. మరోవైపు నిన్న(శుక్రవారం) పాఠశాల ప్రిన్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో విద్యార్థులకు నిన్న భోజనం అందించలేదు. దీనిపై చిన్నారులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఈవో నేరుగా పాఠశాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్, వంట ఏజెన్సీ కార్మికలపై సీరియస్ అయ్యారు. దీనికి సంబంధించిన వార్తా పత్రికల క్లిపింగులను కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు.

**కేటీఆర్ ట్వీట్.. :** “పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా?. అమృత్ స్కీమ్‌ను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి, బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?. పారిశ్రామికవేత్త అదానీకి తెలంగాణ వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా?. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ.. భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?. మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే పిల్లల పస్తులు ఉంటున్నారు. మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్.. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్కపూట ఫొటోలకు ఫోజులిచ్చి గప్పాలు కొట్టడం కాదు. నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన” అంటూ ట్వీట్ చేశారు.

## రాజధాని పనులకు షార్ట్ బ్రేక్

గుంటూరు : అమరావతి పనులకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని పనులకు క్లియరెన్స్ ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. సీఆర్‌డీఏ అధికారులు ఈసీకి లేఖ రాయగా.. ఎన్నికలు పూర్తయ్యాకే టెండర్లు ఫైనలైజ్ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.రాజధాని అమరావతి నిర్మాణ పనులకు కేంద్ర ఎన్నికల సంఘం క్లియరెన్స్ ఇచ్చింది. రాజధాని పనులకు టెండర్లు పిలిచేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది. కానీ.. ఎన్నికలు పూర్తయ్యాకే టెండర్లు ఫైనలైజ్ చేయాలని స్పష్టం చేసింది. ఎమ్మెల్సీ కోడ్ నుంచి రాజధాని టెండర్ల ప్రక్రియకు.. మినహాయింపు ఇవ్వాలని ఈసీకి సీఆర్‌డీఏ కమిషనర్ లేఖ రాశారు. దీనిపై ఈసీ సానుకూలంగా స్పందించింది.ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణంతో చేపట్టబోయే పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ గత నెలలో పెద్ద ఎత్తున బిడ్లు ఆహ్వానించాయి. వీటిలో చాలా పనులకు గడువు ముగిసింది. మరికొన్నింటిని 7వ తేదీన తెరవాల్సి ఉంది. బిడ్లను తెరిచి ఖరారు చేసే దశలో.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి.. షెడ్యూల్ వెలువడింది. దీంతో టెండర్ల ఖరారు, కొత్తవి పిలిచే ప్రక్రియకు బ్రేక్ పడింది. ఫిబ్రవరిలోనే కాంట్రాక్టర్లను ఖరారు చేసి.. పనులు ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వచ్చేనెల 3వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం ఇప్పుడు సమస్యగా మారింది. దీంతో పనుల ప్రాధాన్యత దృష్ట్యా టెండర్ల ప్రక్రియకు అడ్డంకులు లేకుండా చూడాలని.. సీఆర్‌డీఏ అధికారులు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. కేవలం పట్టభద్రులకు సంబంధించిన ఎన్నికలు అయినందున.. నియామాలు సడలించాలని విజ్ఞప్తి చేయగా.. ఈసీ మినహాయింపు ఇచ్చింది.తాము రాసిన లేఖ పట్ల కేంద్ర ఎన్నికల సంఘం అనుకూల నిర్ణయం తీసుకోవడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రూ.40 వేల కోట్లకు సంబంధిన పనులను దశల వారీగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి కూడా టెండర్లు పిలిచేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలో ఏపీ అసెంబ్లీ, సచివాలయం, ఐకానిక్ టవర్ల బిడ్‌లు తెరవనున్నారు.రాజధాని అమరావతిలో వివిధ జోన్లు ఉన్నాయి. ఈ జోన్లలోని లేఅవుట్లలో రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైన్లు, ఇంటర్నెట్ తీగలు వేసేందుకు డక్ట్‌ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇవే కాకుండా.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు అధికారుల నివాస భవనాల్లో విద్యుత్, ప్లంబింగ్, సెక్యూరిటీ, అగ్నిమాపక వ్యవస్థ వంటి పనులు చేపట్టనున్నారుమిగిలిపోయిన వరద నియంత్రణ పనులు, రోడ్లు, సైకిల్ ట్రాక్‌లు, పాదచారుల బాటల అభివృద్ధి, వీధి దీపాలు అమర్చడం వంటి పనులకు సంబంధించి.. మొత్తం రూ. 14,185 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో సీఆర్‌డీఏవి రూ.8,477.30 కోట్లు కాగా.. ఏడీసీఎల్‌వీ రూ.6,397 కోట్లు. పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అటు త్వరలోనే ప్రపంచ బ్యాంక్,

## 2025లోనేనా జనాభా లెక్కలు

న్యూఢిల్లీ : దేశంలో జనగణన ఈ ఏడాది కూడా నిర్వహించకపోవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. బడ్జెట్ లో జనాభా లెక్కల నిర్వహణకు సంబంధించి అరకొర కేటాయింపులే చేయడంతో ఈ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ బడ్జెట్‌లో జనగణన కోసం పరిమిత కేటాయింపులు ఉండటమే ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జనగణన, జాతీయ జనాభా పట్టిక -ఎన్‌పీఆర్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.574.80 కోట్లు మాత్రమే కేటాయించింది.నిజానికి 2021లోనే జనగణన నిర్వహించాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా ప్రతీ 10 ఏళ్లకు ఒకసారి దేశంలో జనాభా లెక్కలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే 2021-2022 బడ్జెట్‌లోనే జనగణన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,768 కోట్లను ప్రతిపాదించింది. అయితే అప్పుడు దేశంలో కరోనా మహమ్మారి భయాలు ఉండటంతో జనాభా లెక్కలు నిర్వహించడం వీలు కాలేదు. ఆ తర్వాత 2023-24 బడ్జెట్‌లో జనాభా లెక్కల కోసం కేవలం రూ.578.29 కోట్లు మాత్రమే నరేంద్ర మోదీ సర్కార్ కేటాయించింది. అయినా దేశంలో లోక్‌సభ ఎన్నికలతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో జనగణన వాయిదా పడింది. 2024-2025లో ఈ మొత్తాన్ని కాస్త పెంచి.. రూ.1,309.46 కోట్లు కేటాయించారు. కానీ ఈసారి 2025-2026 బడ్జెట్‌లో దాన్ని సగానికి పైగా తగ్గింది. రూ.8,754.23 కోట్లతో జనగణన.. రూ.3,941.35 కోట్లతో ఎన్‌పీఆర్‌ను ఆధునీకరించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ 2019 డిసెంబరు 24వ తేదీన ఆమోదముద్ర వేసింది. సాధారణంగా ముందు అనుకున్న ప్రకారం.. 2020 ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ మధ్య దేశంలో జనాభా లెక్కింపు ప్రక్రియ జరగాల్సి ఉండగా.. కొవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. అప్పటినుంచి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ప్రతీ ఏడాది వాయిదా వేసుకుంటూ వస్తూనే ఉంది.గతేడాది ఏప్రిల్ నెలలో చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలిచినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అయితే జనాభా పరంగా చూస్తే దీనికి కచ్చితమైన లెక్కలు లేవు. వేర్వేరు పథకాలకు సంబంధించి 2011 నాటి గణాంకాల ఆధారంగానే లక్ష్యాలు, వ్యయ అంచనాలు ఇప్పటికీ రూపొందిస్తున్నారు. 2020లో నిర్వహించాల్సిన ఈ జనాభా లెక్కలు ఇప్పటికే 5 ఏళ్లు వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే 9 ఏళ్ల వ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ లెక్కలు కూడా వెల్లడించింది. అయితే సరైన గణాంకాలు లేకుండా నీతి ఆయోగ్ ఈ ప్రకటన చేయడంపై దేశంలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. మరోవైపు.. దేశంలో జనగణన పూర్తి అయి లెక్క తేలే వరకు నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా ఆగాల్సిన పరిస్థితి నెలకొంది.

## విశ్వసనీయత వున్నవాడినికాబట్టే...

స్పష్టంచేశారు. భయం అన్నది నాలో ఏ అణువులోను లేదని... కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవులతో పాటు రాజకీయాలనే వదులుకున్నానని ట్వీట్ చేశారు. ఏపీ వైఎస్సార్‌సీపీ ఓటమి తర్వాత పలువురు నేతలు వరుసగా పార్టీని వీడుతున్నారు. నలుగురు ఎంపీలు సైతం రాజీనామా చేశారు. ఈ క్రమంలో జగన్ స్పందిస్తూ రాజకీయాల్లో క్రెడిబిలిటీ ఉండాలని... ఫలానా వాళ్లు తమ నాయకులు అని కాలర్ ఎగరేసుకొని చెప్పేలా ఉండాలన్నారు. బయటకు వెళ్లే ప్రతి రాజ్యసభ సభ్యుడికి విశ్వసనీయత ఉండాలన్నారు. రాజకీయాల్లో కష్టనష్టాలు వుంటాయని... ఐదేళ్లు కష్టపడితే మళ్లీ మన టైమ్ వస్తుందన్నారు. విశ్వసనీయత ముఖ్యమని చెప్పారు. రాజ్యసభ ఎంపీల్లో సాయిరెడ్డితో కలిపి నలుగురు వెళ్లిపోయారని... రాజకీయాల్లో వున్నప్పుడు విశ్వసనీయతకు అర్థం తెలిసి ఉండాలన్నారు. మనంతట మనమే ప్రలోభాలకు లొంగి... భయపడి రాజీనామాపడి పోతే మన వ్యక్తిత్వం, విలువలు, విశ్వసనీయత ఏంటని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డికైనా.. ముగ్గురు ఎంపీలకైనా ఇంకా ఒకరో ఇద్దరో పోతే వాళ్లకైనా అంతేనన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ ఉందంటే అది ఎవరివల్లా కాదని... దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు మాత్రమేనన్నారు.

## మహారాష్ట్ర ఓటర్ల జాబితాల్లో భారీగా...

ఓటర్ల జాబితాలో చేర్చారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. దాంతో మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాను మించిపోయిందని వ్యాఖ్యానించారు. ఐదునెలల్లో పెరిగిన ఓటర్ల సంఖ్య ఇంచుమించుగా హిమాచల్ ప్రదేశ్ జనాభాకు సమానమని అన్నారు. ఈ కొత్త ఓటర్లంతా ఎక్కడి నుంచి వచ్చారని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. వారంతా ఎవరని నిలదీశారు. మహారాష్ట్ర ఓటర్ల జాబితాను ప్రతిపక్ష పార్టీలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాయని, ఈ అధ్యయనం ద్వారా ఓటర్ల జాబితాలో అనేక అక్రమాలు జరిగినట్లు తేలిందని చెప్పారు. అందుకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడ్డ ప్రతిపక్షపార్టీలన్ని ఒక్క తాటిపైకి వచ్చి ప్రశ్నిస్తున్నాయని, ఎన్నికల సంఘం సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు.


## విధ్వంసమైన వ్యవస్థలను...

మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. అయితే ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలి. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నేను విశ్వసిస్తాను. అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప... విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్ తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్ లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. ఫైళ్ల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు... ఎవరినీ తక్కువ చేయడానికి కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది. ‘పీపుల్ ఫస్ట్’ విధానంతో నేను, నా కేబినెట్ సహచర మంత్రులంతా పనిచేస్తున్నాము. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నాము. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి... సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో శాఖల్లో అత్యున్నత ప్రతిభ చూపిస్తారని ఆశిస్తున్నాను” అని చంద్రబాబు వివరించారు.

## పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్...

చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పి-4 విధానం ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విధి విధానాల రూపకల్పనకు ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించడంతో పాటు ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొందిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ సలహాలు, సూచనలు ఆధారంగానే పి-4 విధానాన్ని అమలు చేస్తామన్నారు. పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు తదితరులను ఉగాది రోజు జరిగే పి-4 ప్రారంభ కార్యక్రమానికి ప్రభుత్వం ఆహ్వానించి వారందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం ద్వారా పి-4 అమలుకు శ్రీకారం చుట్టనున్నట్టు సీఎస్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర విజన్-2047లో భాగంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి విజన్ ప్రణాళికలను రూపొందించాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు గాను ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నోడల్ అధికారికి ఆరుగురు సభ్యుల బృందం.. అంటే గ్రామ వార్డు సచివాలయాలకు చెందిన ఐదుగురు, ప్రణాళికా శాఖ ద్వారా ఒక ప్రొఫెషనల్ సహాయపడతారని అన్నారు. ప్రణాళికా శాఖ ద్వారా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా వివరాలు సేకరించాల్సి ఉంటుందని ఈ కన్సల్టెన్సీ సర్వేను ఫిబ్రవరి 7వ తేదీ నుండి 22వ తేదీ లోగా సేకరించాల్సి ఉందన్నారు. తొలుత ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పి-4 విధానం అమలు, స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా ప్రణాళికల రూపకల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్ యువరాజ్ ఎంఎస్ఎంఇ సర్వే నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## మీ పని...



అభినందనలు తెలిపారు. ఈ ఆపరేషన్‌తో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు. అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో మీ అంకితభావం, వేగవంతమైన చర్యలు తీసుకున్న అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు, అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### కనక రాజమ్మకు నివాళులర్పించిన......
## టిడిపి నాయకులు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: వెదురుకుప్పం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ చిల్ల రమేష్ తల్లి గారైన కనక రాజమ్మకు నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు మరియు క్లస్టర్ ఇన్చార్జి పి మోహన మురళి బిజెపి నాయకులు బి హనుమంత రెడ్డి స్థానిక తెలుగుదేశం నాయకులు బి రామకృష్ణారెడ్డి బి చంగల్ పందు రెడ్డి కే తిరుమల్ రెడ్డి స్థానిక సర్పంచి మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలవడానికి ....
## మూడు చక్రాల సైకిల్ పై విజయవాడ బయలుదేరిన దివ్యాంగుడు




శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి07: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కోలాలు తిమ్మనపల్లి గ్రామానికి చెందిన జన సైనికుడు దివ్యాంగుడు అయిన బాలకృష్ణ శుక్రవారం మూడు చక్రాల సైకిల్ పై విజయవాడ వెళ్లి ఉపముఖ్యమంత్రిని కలిసి తన అభిమానాన్ని చాటుకోవడానికి బయలుదేరారు.ఈ సందర్భంగా ఆయన కు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కిషోర్,మరియు పార్టీ కార్యకర్తలు సహకారం అందించారు.

### బీసీ కార్పొరేషన్ లోన్లకు....
## గడువు పెంపు,
### దరఖాస్తుదారులకు కీలక సూచనలు చేసిన కమీషనర్



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి07: పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపిన సమాచారం మేరకు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, చిత్తూరు వారి ఆదేశాల మేరకు బిసి కార్పొ రేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 12 వరకు గడువు పెంచడం జరి గింది. స్వయం ఉపాది నిమిత్తము ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులు 2024 -25 ఆర్థిక సంవత్సరమునకు గాను %https://apobmms.apcfss.in%/ వెబ్ సైట్ నందు స్వయంగా మీ మొబైల్ నందు గానీ లేదా మీ సమీప సచివాలయము నందు గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. కావలసిన ధృవీకరణ పత్రములు, కుల ధృవీకరణ పత్రము, ఆధారు కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, రేషన్ కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రము, మొబైల్ నెం. మరియు బ్యాంకు పాస్ బుక్, కావున, ఈ దిగువ తెలిపిన కార్పొరేషన్ లకు సంబందించిన వారు కూడా దరఖాస్తులు చేసుకొనవచ్చు నని బిసి, బ్రాహ్మణ,ఈబిసి,కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు (బలిజ, తెలగ, ఒంటరి మాత్రమే) వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి పదివేలురూపాయలు....
## జరిమానలేక ఏడు రోజులు జైలు శిక్ష!!

శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: శాంతిపురం మండలం వేటగిరి కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. పురుషోత్తమను వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పట్టు పడ్డాడు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి శుక్ర వారం కుప్పం కోర్టుకు హాజరు పరచగా, ముద్దాయికి పదివేల రూపాయల జరిమానా లేక ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది .ఈ సందర్భంగా రాళ్ళబుదుగురు ఎస్సై నరేష్ మాట్లాడుతూ మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనాలు నడిపే వారిపై ఇకపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.?

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పల్నాడు: నకరికల్లు - అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పాత కంప్యూటర్ల సామానులతో హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ లారీ ఆగి ఉన్న ట్రాక్టర్ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరిని స్థానిక వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న నకరికల్లు ఎస్సై సురేష్ విచారణ ప్రారంభించారు. ఈ ప్రమాదం లో మరణించిన వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్ మస్తాన్ గా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం

### వెలివాడ బ్రతుకులలో.....
# వెన్నెల జ్యోతి రమా బాయి అంబేడ్కర్



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం స్థానిక లక్ష్మీపురం నందు మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి త్యాగశీలి ఆదర్శమూర్తి మాత రమా బాయి అంబేడ్కర్ 127వ జయంతి సందర్భంగా స్థానిక మహిళలు రమాబాయి అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కో - కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ రమా బాయి ఒక నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించి భారతదేశానికి రాజ్యాంగం రూపంలో అంబేడ్కర్ గారిని మనకందించారని మహనీయులు చేసిన త్యాగాలను మనం ఎల్లవేళలా స్మరిస్తూనే ఉంటూ జ్ఞానం అనే దీపాన్ని వెలిగించాలని అన్నారు బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎంతో స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవిస్తున్నారంటే అది బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన పోరాటం వారు సాధించిన హక్కుల ద్వారానే అని ఎవరిని అడిగిన చెబుతారు కాని బాబాసాహెబ్ అంబేడ్కర్ గారు అంత గొప్పగా చదువుకోవడానికి అన్ని పోరాటాలు చేయడానికి పూర్తిగా సహకరించిన తన సతీమణి “ మాత రమాబాయి “ గారిని మాత్రం ఈ సమాజం గుర్తించక పోవడం బాధాకరం ఆమె చిన్న వయసులోనే కుటుంబ భారాన్నంతా తన నెత్తినేసుకోని బాబాసాహెబ్ అంబేడ్కర్ గారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చిన ధీర వనిత ఒక పక్క తన కడుపున పుట్టిన బిడ్డలకు సరైన ఆహారం లేక జబ్బున పడిన బిడ్డలకు ఆసుపత్రులలో చూపించుకొనే శక్తి లేక చని పోతున్న అలాంటి పరిస్థితులలో కూడా బాబాసాహెబ్ ను ఇబ్బంది పెట్టకుండా సహకరించిన గొప్ప త్యాగశీలి”మాత రమాబాయి అంబేడ్కర్ “ ఆ కాలంలోనే కుటుంబ భారమునంత మోస్తూ తన సంతానాన్ని జీవితాన్ని సర్వస్వాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి అని ఆమె త్యాగం సహనం మరువనిది ఆ మహా తల్లి జయంతి ఘనంగా నిర్వహించుకోని వారి సేవలను త్యాగాలను స్మరించుకుందామని తెలిపారు కార్యక్రమం మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్,సి.ఆర్.డి.ఎస్.అధ్యక్షులు కె. గటప్ప, మాలమహానాడు మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గా ప్రసాద్,కుశల్ కుమార్, లక్ష్మీ, చెంగమ్మ, రత్నమ్మ, రెడ్డెమ్మ,సరస్వతి, స్వాతి, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### షాది మహల్, ఖబరస్థాన్ నిర్మాణాలను.....
# పరిశీలించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని యలమంద క్రాస్ లో షాది మహల్, ఖబర స్థాన్ ఆగిన నిర్మాణాలు చేపట్టేందుకు అను మతులు కల్పించాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు శాసనస భ్యులు నల్లారికిషోర్ కుమార్ రెడ్డికు ముస్లిం,మైనార్టీలు విన్న వించుకున్నారు. శుక్రవారం ఆయన యల్లమంద క్రాస్ లోని షాది మహల్,ఖబరస్థాన్ స్థలం పరిశీలించా రు. 2013 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గా ఉన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చొరవతో షాది మహల్, ఖబ రస్థాన్ నిర్మాణాలు చేపట్టామని 20 లక్షలు డబ్బు కూడా సాంక్షన్ చేశారని దాంతో పిల్లర్స్ వరకు పనులు చేపట్టామని ప్రభు త్వం మారిన తర్వాత ఆగిపోయాయని ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి కు తెలియజేయడంతో, దాంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చరవాణి లో మాట్లాడి షాదీ మహల్ ఖబరస్తాన్ ల ఆగి న నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి అను మతులు కల్పించడంతోపాటు,ఖబర్ స్థాన్ కొరకు కాంపౌండ్ వాల్ పనులు మొదలు పెట్టాలని అన్నారు. దాంతో ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఘనంగా శాలువాలతో సన్మానించి తమ అభిమానా న్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు,ముస్లిం మైనార్టీలు హనీఫ్, హబీబ్,షరీఫ్,అమీర్, హుస్సేన్ షంషీర్ కరీం,బోదేషా,ముస్తఫా, అల్లాబఖష్, పలు వురు నాయకులు కార్యకర్తలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

# పీలేరు ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో విచారణ



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: అన్నమయ్య జిల్లా పీలేరు ఆయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం ఏపీ గురు కుల పాఠశాలల జిల్లా కన్వీనర్ బ్రహ్మాజీ విచారణ చేపట్టారు. ఈ విచారణకు పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చేసిన ఫిర్యాదే కారణమైంది. ఇటీవల స్పందన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ,పాఠశాలలో విద్యార్థిను లకు కోడిగుడ్లు సరఫరా చేయ డం లేదని ఆరోపించారు.ఈ ఫిర్యా దును పరిగణన లోకి తీసుకుని,జిల్లా కన్వీనర్ బ్రహ్మాజీ శుక్రవారం పాఠశాల ను సందర్శించి, పరిస్థితులను పరిశీ లించారు. విచారణ లో,కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ తన బాధ్యత లను సక్రమంగా నిర్వర్తించక పోవడం వల్ల విద్యార్థినులకు కోడిగుడ్లు అందక పోవడం తేలింది. దీనిపై కన్వీనర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, కాంట్రా క్టర్‌ను వెంటనే మార్చాలని ఆదేశాలు జారీ చేశారు.అదనంగా, పాఠశాలలో విద్యార్థిను లకు అందుతున్న భోజన ప్రమాణాలు, హాస్టల్ వసతులు, తరగతి గదుల నిర్వ హణ, ఇతర మౌలిక సదుపాయాలను సమగ్రంగా తనిఖీ చేశారు.విద్యార్థినుల ఆరోగ్యం, విద్య,వసతి,భోజనం తదితర విష యా ల్లో ఏవైనా లోపాలు ఉంటే వాటిని తక్షణమే సరిచేసుకోవాల్సిందిగా పాఠశాల యాజమాన్యానికి సూచనలు ఇచ్చారు.తన విచారణ అనంతరం కన్వీ నర్ బ్రహ్మాజీ మాట్లాడుతూ,”పాఠశాల నిర్వహణ, విద్యార్థినులకు అందుతున్న సదుపా యాలు తృప్తికరంగా ఉన్నప్పటికీ, కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమ య్యాడు. ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాల్సింది, కానీ ప్రిన్సిపల్ లోకే శ్వరి ఈ సమ స్యను ముందుగా ఎందుకు తెలియ జేయలేదో అర్థం కావడం లేదు” అని ప్రిన్సిపల్‌ను మందలించారు. కోడి గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను తక్షణమే మార్చాలని స్పష్టంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లోకేశ్వరి బోధన,బోధనేతర సిబ్బంది,పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్జీవో హెూం లో సమావేశమైన యానాదుల సంఘం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కుప్పం పట్టణం ఎన్జీవో హెూమ్ నందు యానాదుల సంఘం నిర్వహించిన సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యానాదులు హక్కులు సాధించుకోవడానికి ఐక్యమత్యంగా ఉండి పోరాడాలని సూచించారు. అలాగే కుల సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, విద్యావంతులైన యానాదులు ప్రభుత్వ పథకాలపై కుల సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా ఆర్. కృష్ణప్ప ను, ఉపాధ్యక్షులుగా నారాయణ ను, కార్యదర్శిగా వెంకటరమణ ను, ఉప కార్యదర్శి బాబ, అశోక్, జె. కృష్ణప్ప లను, కోశాధికారిగా బి గాంధీ ని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా సరస్వతి, జేజప్ప లను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాలాజి కుల సభ్యులు పాల్గొన్నారు.

### కొత్తపేట జయప్రకాష్ స్ట్రీట్ లోని ....
# ఓం శక్తి ఆలయంలో అన్నదాన కార్యక్రమం





కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాష్ రోడ్డులో నెలకొని ఉండు శ్రీ ఓం శక్తి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుండి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణతో మహా మంగళహారతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రతి సంవత్సరం ప్రహంగనంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కార్య నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంజులమ్మ, బాబు, మురుగేష్, బాలాజీ, మునెప్ప, చలపతి తదితరులు పాల్గొన్నారు.

### పీలేరులో ఉర్దూ మీడియం జూనియర్.....
## కళాశాలను ఏర్పాటు చేయాలి
### ఎన్టీఆర్ నసీఫ్



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: అన్నమయ్య జిల్లా పీలేరు మండలం లో ఉర్దూ అభ్యసించే విద్యార్థులు గణనీయ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో ఉర్దూమీడియం జూనియర్ కళాశాల ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహా రాల సలహా దారులు యం.ఎ. షరీఫ్ ని పీలేరు మైనా రిటీ యువనేత ఎన్టీఆర్ నఫీస్ కోరారు.మైనారిటీ విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసిన అనంతరం ఉర్దూ కళాశాల పీలేరు లో లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. 10వ తరగతి వరకు ఉర్దూ మీడియం చదివిన ఆడపిల్లలలో చాలామంది ఇంటర్ అందు బాటులో లేకపోవడం తో,బయట ప్రదేశా లకు వెళ్ళి చదవ లేక తమ చదువును మధ్యలోనే మానేస్తున్నారు.అదేవిధంగా పీలేరు లో ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణా కేంద్రం మరియు గ్రంధాలయము ను కూడా ఏర్పాటు చేసి పీలేరు ప్రాంత మైనా రిటీ విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు.

### అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా......
## తనిఖీ చేసిన పిడి వెంకటేశ్వరి



రొంపిచెర్ల,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 07: రొంపిచెర్ల మండలం ఫజురుల్లా పేట అంగన్వాడి కేంద్రాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరి శు క్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్ వాడి కేంద్రంలో చిన్నారుల నమోదు పౌష్టికాహార పంపిణీ. రికార్డుల నమోదు. అంగన్ వాడి కేంద్రం పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భం గా పిడి వెంకటేశ్వరి మాట్లాడుతూ అంగ న్వాడి సిబ్బంది కేంద్రాల నిర్వహణను సమ ర్థవంతం గా నిర్వహించాలని ఎలాంటి పొర పాటు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకా హారాన్ని సకాలంలో చిన్నారులు గర్భవతులకు అందించాలని అన్నారు. గర్భవతులకు పౌష్టికాహారం ఆరోగ్య జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతున్న విద్యార్థుల హాజరును, రిజిస్టర్లను కిచెన్ కార్డులను పరిశీలించి, గర్భవతులతో ముఖాముఖీ మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిడి వెంట సూపర్వైజర్లు అంగన్వాడి సిబ్బంది ఉన్నారు.

## అదుపు తప్పిన ఆటో
### - ఇద్దరికి గాయాలు



చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 07: చౌడేపల్లి మండలం లోని చారాల వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది.అందులో ప్రయాణిస్తున్న బంగారుపాళ్యంకు చెందిన మనోహర్ కుమార్తె భానుప్రియ(10), అఖిల్(8) తీవ్రగాయాలయ్యాయి.ఆటో బంగారు పాళ్యం నుండి తరిగొండకు వెళ్తున్న ట్లు సమాచారం,ప్రమాదం లో గాయ పడిన క్షతగాత్రులను 108 సిబ్బంది గణేష్,ప్రసాద్ లు చౌడేపల్లి ప్రాథమిక ఆసుపత్రి కి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్త మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### విద్యుత్ వినియోగదారులకు....
## విద్యుత్ కు అంతరాయం

శాంతీపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: ఫిబ్రవరి 8 శనివారం ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు 132/33.కేవీ.శాంతిపురం ఎస్.ఎస్. నందు విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ కు అంతరాయం ఉండును. కావున శాంతిపురం, రామకుప్పం మరియు వి కోట మండలాల పరిధిలో గల 33/11.కేవీ.ఎస్.ఎస్.(మొత్తం 22 సబ్ స్టేషన్లు)లో విద్యుత్ సరఫరాకు అంత రాయం వుంటుందని డివిజనల్ ఇంజనీర్ హిమ్మత్ సాగర్ గారు తెలియజేశారు. పై మండలాల వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### షాహి ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమలో ....

## న్యాయ అవగాహన సదస్సు

**ముఖ్యఅతిథిగా అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వరుణ్ తేజ**




కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కుప్పం మునిసిపాలిటీ లోని షాహి పరిశ్రమ నందు శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వరుణ్ తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో, మహిళలతో మాట్లాడుతూ పరిశ్రమలో వారికి ఉన్న సౌకర్యాల గురించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా మహిళల సమస్యలపై ఆరా తీస్తూ ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారా అన్న విషయాన్ని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ, మహిళ చట్టాల గురించి, కార్మిక చట్టాల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రప్ప, కార్యదర్శి ఉదయ్ కుమార్, పుష్పలత, పారా లీగల్ వాలంటర్ మహేష్, లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, కృష్ణమూర్తి, పోలీసు శాఖ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

### కుప్పం నర్సింగ్ కళాశాలలో ......

## ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కుప్పం నర్సింగ్ కళాశాలలో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ ఉత్సవాలను బీసీఎన్ కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు ప్రారంభించి ప్రసంగించారు. క్రీడలు మానసిక ఉల్లాసం తో పాటు శారీరక దృఢత్వాన్ని




పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పేర్కొన్నారు. క్రీడల వలన స్నేహ సంబంధాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ క్రీడలలో విజయం సాధించాలంటే సాధన ప్రధానమన్నారు. ఈ ఆటలలో మీరు సాధించిన విజయం సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు క్రీడాజ్యోతి ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. యూనివర్సిటీ క్రీడల్లో రాణించి జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులను చైర్మన్ అభినందించారు. అనంతరం వివిధ పాటల పోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వైస్ చైర్మన్ సునీల్ రాజ్, సీఈఓ సాగర్ రాజు, ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత..

## సర్పంచ్ గోవింద్




ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని బొమ్మయ్య పల్లి సర్పంచ్ గోవింద్ అన్నారు.శుక్రవారం వెదురుకుప్పం మండలం బొమ్మయపల్లి పంచాయతీ లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం ముళ్ళకంపలను శుభ్రపరిచారు. అలాగే అపరిశుభ్రంగా ఉన్నమురికి నీటి కుంటలు తొలగించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్...

**2025-26 ఆర్థిక బడ్జెట్లో గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు వూతమిచ్చిన ఎన్ డి ఏ సర్కార్...**

**గ్రామీణ అభివృద్ధికి 190,406 కోట్లు- వ్యవసాయ రంగానికి-1,37,757 కోట్ల**

**కేటాయింపులను విశ్లేషించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**



చిత్తూరు (ఢిల్లీ), చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం.. 2025-26 ఆర్థిక బడ్జెట్ను పార్లమెంట్లో ప్రవేశపెట్టి, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు వూతమిచ్చి, ప్రజల చేత ప్రశంసలందుకుంటోదని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లో లీడర్, జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్ల పార్ల మెంట్ కమిటీ సభ్యులు, చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముందుకు సాగుతోందని తెలియజేశారు. ఇది మోదీ సర్కార్ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.కేంద్ర ఆర్థిక బడ్జెట్కుసంబంధించి, విశ్లేషణ చేశారాయన.మునుపెన్నోడు లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక బడ్జెట్లో గ్రామీణ మంత్రిత్వ శాఖకు -1,90,406 కోట్లు , రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని 1,37,757 కోట్ల రూపా యలను వ్యవసాయ మంత్రిత్వ శాఖకు కేటాయించిందని తెలిపారు. 2024-25 ఆర్థిక బడ్జెట్ సవరించిన అంచనాల కంటే 8 శాతం గ్రామీణ అభివృద్ధికి..,6.8 శాతం ఎక్కువగా కేటాయింపులు జరిపిందని విశ్లేషించారు.2021 నాటికి భారతదేశ జనాభాలో 65 శాతం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు.., వ్యవసాయాన్ని తన జీవనోపాధిగా ఎంచుకొని మనుగడ సాగి స్తున్నారని చెప్పిన చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.., వ్యవ సాయ రంగంలో 3.8 శాతాన్ని ఆర్థిక వృద్ధి ని సాధించారని, ఇది మునుపటి కంటే 14 శాతం ఎక్కువ అని తెలియజేశారు. 2001-02 నుంచి వ్యవసాయ ఉత్పత్తి సగటు వార్షిక రేటు 3 శాతం వద్ద పెరిగిందని.., మిగిలిన ఆర్థిక వ్యవస్థ సంవత్స రానికి 7శాతం వద్ద దీనికి భిన్నంగా ఎక్కువైందన్నారు.ఇకపోతే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2024-25 ఆర్థిక బడ్జెట్లో సవరించిన అంచనాల మాదిరిగానే 86,000 కేటాయింపులు జరిపినట్లు తెలుస్తోందన్నారు. గ్రామీణ ప్రజలకు జీవనోపాధిగా మారిన గ్రామీణ ఉపాధి హామీ పథకం..,2025 జనవరి నాటికి, 30 రాష్ట్రాలు, యూనియన్ భాగాలలో పనిచేసిన కార్మికులు .., వారు అందుకున్న వేతనాలు 11 రాష్ట్రాలు, యూటీలలో నోటుపైడ్ వేతన రేటు కంటే తక్కువగా ఉన్నాయన్నారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండు దశల్లో గ్రామీణ ప్రాంతాలలో 2.95 కోట్ల రూపాయల వ్యయంతో పి.యూ.సి.సి.ఏ గృహాలను నిర్మించాలనే లక్ష్యాన్ని కలిగి ఉందనీ.., అలాగే 46 వ దశలో ..2016-2019 మధ్యకాలంలో సుమారు కోటి గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకు న్నారని.., రెండవ దశలో 195 కోట్ల గృహాల ను నిర్మాణం చేయాలని భావించినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలో 2019 నుంచి 2022 నాటికి మొత్తం 210 కోట్ల గృహాలను రెండు దశల్లో పూర్తి చేశారని ఆయన వివరించారు. ఈ పథకానికి 2025-26 ఆర్థిక బడ్జెట్లో 54,832 కోట్ల రూపాయల ను కేటాయించినట్లు చిత్తూరు ఎంపీ పేర్కొ న్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ను పరిశీలిస్తే.. గతం కంటే 69 శాతం పెరిగిందన్నారు. అయితే 2024-25 ఆర్థిక బడ్జెట్లో విడుదల చేసిన 41 శాతం నిధులను వినియోగించకపోవ డం గమనార్హమన్నారు.ఇక ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం విషయాని కొస్తే...గ్రామీణ ప్రాంతాలలో పేలవమైన కనెక్టివిటీ సమస్యను పరిష్కరించడానికి అప్పటి ప్రభుత్వం 2000 వ సంవత్సరం లో పి.ఎమ్.జి.యస్.వై పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. అర్హత పొందిన గ్రామీణ ప్రాంతాలన్నిటికీ రహదారి మార్గాలను మెరుగుపరిచి, వాటిని అనుసంధానం చేసే లక్ష్యంతో.., 2025-26 ఆర్థిక బడ్జెట్లో 19,000 కోట్ల రూపాయలను కేటాయిం చిందని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్తో పోలిస్తే ప్రస్తుతం 31 శాతం ఎక్కువ అని విశ్లేషించారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

## మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్ పూర్తీ బాధ్యతల స్వీకరణ



హిందూపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ ఛాంబర్ లోకి చైర్పర్సన్ గా డి ఈ రమేష్ కుమార్ శుక్రవారం శుభ ముహూర్తాన పూర్తి భాధ్యతలు స్వీకరించి మునిసిపల్ ఛాంబర్ లో ఫైళ్ల పైన తొలి సంతకం చేశారు. అదే విధంగా అధికారకంగా కార్యాలయ సెక్షన్ హెడ్స్ తో సమావేశం నిర్వహించి మునిసిపాలిటీ అభివృద్ధికీ ఉద్యోగులు - సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని కోరారు.మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం శుభ ముహూర్తంలో మున్సిపల్ చైర్మన్ సీటును అదిరోహించిన డిఇ రమేష్ కుమార్ చైర్మన్ చాంబర్లో తమ పదవిని అధిరోహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది, టీడీపీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున వచ్చి పూలమాలలతో దృశ్యాలువలతో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్తానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో తోటి కౌన్సిలర్ల సహకారంతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ద్వారా తమను చైర్మన్ గా ఎన్నుకోవడం చాలా అదృష్టమని అన్నారు. రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 38 వార్డులలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో వందల రూ.కోట్లు పురం మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని స్థానిక ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు.తమ గెలుపుకు సహకరించినటువంటి ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సంగం శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తది తరులు వున్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కస్తూరిబా పాఠశాలలో

### శాంతి డెంటల్ క్లినిక్ వారి సౌజన్యంతో ....

## ఉచిత దంత వైద్య శిబిరం




రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజిలాపురం కస్తూరిబా పాఠశాల నందు శాంతి డెంటల్ క్లినిక్ వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరాన్ని లైన్స్ క్లబ్ వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల్లోని 300 మంది విద్యార్థినిలకు శాంతి డెంటల్ క్లినిక్ వైద్యులు డా. సుదర్శన్ వారి సమక్షంలో పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా డెంటల్ కిట్లును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆ కార్యక్రమంలో తమను కూడా భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని వైద్యులు డా. సుదర్శన్ తెలిపారు. తమ విన్నపాన్ని మన్నించి క్లబ్ తరపున ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు లయన్స్ క్లబ్ వారు అందరూ శాంతి డెంటల్ క్లినిక్ వ్యవస్థాపకులు డా. సుదర్శన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ డా.మహేష్, పీజీ సెల్వం, డా. కృష్ణమూర్తి, ఏకాంబరం, మహేష్ రెడ్డి, శాంతి డెంటల్ క్లినిక్ వైద్యులు డా. ప్రసాద్ మరియు సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ అమరావతి, పాఠశాల ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## నల్లారికి లైన్ క్లియరేనా..?

తిరుపతి : వైసీపీ రాజ్యసభ పదవికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. దీంతో త్వరలో రాజ్యసభకు ఎన్నిక జరగనుంది. అయితే దీనికి సంబంధించి ఇప్పటికే బీజేపీ తన ఖాతాలో వేసుకునేందుకు సిద్ధమవ్వడానికి సిద్ధమవుతుంది. కానీ టీడీపీ నేతలు కూడా ఈ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. 2028 జూన్ 21 వరకూ పదవీ కాలం ఉండటంతో దీనిపై నేతలు ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు వద్దకు పైరవీల కోసం వస్తున్నారు. అయితే ఇది ఇప్పటికే బీజేపీకి ఫిక్స్ అయిందన్న ప్రచారంతో నేతలు డీలా చేస్తున్నారు. త్వరలోనే రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడుతుందని చెబుతున్నారు. అయితే ఈరోజు జగన్ మీడియా సమావేశంలో ఒక ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారురాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ మరికొందరు కూడా వెళ్లే అవకాశముందని అంటున్నారని అనడంతో ఇంకా ఉన్నారా? అన్న అనుమానం బయలుదేరింది. అయితే విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన పోస్టు మాత్రం బీజేపీ నేతలు తమకు కావాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. అయితే ఆ పార్టీ ఎవరిని నిలబెడుతుందన్నది ఇంతవరకూ బయటకు రాలేదు. మెగాస్టార్ చిరంజీవి అని, మాజీ ముఖ్యమంత్రినల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అని పలు రకాలుగా ప్రచారం జరుగుతుంది. అయితే వీరిద్దరూ కాకుండా కొత్త వారికి పార్టీని నమ్ముకుని సుదీర్ఘకాలం నుంచి ఉన్నవారికి ఇచ్చే ఛాన్స్ ఉందని కూడా తెలుస్తుంది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ రాలేదు. బీజేపీ అగ్రనాయకత్వం ఎవరి పేరు ఖరారు చేసినా కూటమి ప్రభుత్వం దానిని కాదనే అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వంతో ప్రస్తుతం అవసరం ఉన్న నేపథ్యంలో టీడీపీ, జనసేనలు బీజేపీ అభిప్రాయానికి తలవంచే పరిస్థితులు ఉన్నాయి. అసలు విజయసాయిరెడ్డి రాజీనామా చేయడానికి తామే కారణమని, అందుకే తమకే ఈ స్థానం కావాలని ఇప్పటికే కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు స్పష్టం చేసింది. అయినా టీడీపీ నుంచి ఆశావహులు మాత్రం పెద్దయెత్తున పోటీ పడుతున్నారు. ఎక్కువ సమయం పదవీకాలం ఉండటంతో దేవినేని ఉమ లాంటి వాళ్లు కూడా తమ పేరును పరిశీలించాలని అధినాయకత్వాన్నికోరినట్లు తెలిసింది. అయితే ఈ పోస్టు ఎవరికి వెళుతుంది? ఎవరిని చివరకు ఎంపిక చేస్తారు? ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే కనిపిస్తున్నా, బీజేపీకే దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం.

# 2025 ఆర్థిక బడ్జెట్ దేశాన్ని స్వావలంబన వైపు నడిపిస్తుంది

**ఆంధ్రప్రదేశ్ పునరుజ్జీవనానికి ఊతమిచ్చింది... మానవ మూలధన పరివర్తనకు ఉత్ప్రేరకంగా నిలుస్తుంది**

**లోక్ సభలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు**



చిత్తూరు (ఢిల్లీ), చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 07: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 ఆర్థిక బడ్జెట్ భారతదేశాన్ని స్వావలంబన వైపు నడిపిస్తుందన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు... మానవ మూలధన పరివర్తనకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని ఆయన తెలియజేశారు. ఢిల్లీ పార్లమెంటు సమా వేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., 2025 ఆర్థిక బడ్జెట్ చర్చల్లో పాల్గొని, ప్రసంగించారు. వికసిత భారత్ లక్ష్యంగా మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన 2025 ఆర్థిక బడ్జెట్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందన్నారు. 2024 నుంచి 2029 వరకు ప్రపంచ ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తుందటంలో ఏమాత్రం సందేహం లేదన్నారు.మరి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి, విభజన చట్టాన్ని అమలు పరచడంలో భాగంగా ఎన్డీఏ సర్కార్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక బడ్జెట్లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి 11,440 కోట్లు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ స్థాపనకు 15,000 కోట్లు, అలాగే అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కూడా నిధులను కేటాయించి, ప్రాంతీయ వృద్ధికి దన్నుగా నిలిచి..,ఏపీ పై తమకున్న చిత్తశుద్ధిని ఎన్డీఏ సర్కార్ నిరూపించుకుందని ఆయన తెలియజేశారు. మోదీ సర్కార్ అందించిన సహాయ సహకారాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా ఇవి సాధ్య మైందన్నారు.భారతదేశం ఇంధన పరివర్తన,.. నికర-సున్నా లక్ష్యాల వైపు ప్రయాణంలో ఓ ముఖ్యమైన అడుగును సూచిస్తుందని ఆయన తెలియజేశారు. ఆత్మనిర్భర్ మిషన్‌పై బలమైన దృష్టితో, బడ్జెట్ స్వచ్ఛమైన శక్తి, ఆర్థిక స్థితిస్థాపకత, స్థిరత్వం పట్ల దేశం నిబద్ధతను నొక్కి చెబుతోందన్నారు. అణుశక్తి, స్వచ్ఛమైన ఇంధన ప్రత్యామ్నాయాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రోత్సాహం స్పష్టమైన సందేశాన్ని పంపుతుందన్నా రాయన.తక్కువ కార్బన్ అభివృద్ధిలో ప్రపంచ ఆలోచనా నాయకుడిగా భారత దేశం తన స్థానాన్ని బలోపేతం చేసుకుం టోందన్నారు. లాఅభివృద్ధి కోసం ఓ దార్శనికత,సమ్మిళిత వృద్ధిని నడిపించ డానికి, స్థితిస్థాపకమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను నిర్మించ డానికి దోహదం చేస్తుందన్నారు. 2025-26 బడ్జెట్ ‘ సబ్ కా వికాస్ ‘ సాధనలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇది అన్ని రంగాలలు, ప్రాంతాలలో స్థిరమైన అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం సమతుల్య వృద్ధి వైపు వ్యూహాత్మక విధానాన్ని సూచిస్తుందని చెప్పారాయన. ఆత్మనిర్భర్ భారత్ పై దృష్టి సారించిన కేంద్ర బడ్జెట్ 2025-26 ఆర్థిక వృద్ధిని నడిపించడానికి, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడానికి, ప్రైవేట్ రంగ పెట్టుబడులను పెంచడానికి, గృహ విశ్వాసాన్ని పెంచడానికి, భారతదేశంలో పెరుగుతున్న మధ్యతరగతి ప్రజల ఖర్చు శక్తిని పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఫలింపజేస్తుందని పేర్కొన్నారు.అత్యాధునిక నైపుణ్య కార్యక్రమాలు, ప్రపంచ భాగస్వామ్యాలు, పరిశ్రమ ఆధారిత శిక్షణా కార్యక్రమాల ద్వారా ‘మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్’ దార్శనికతను బలోపేతం చేస్తుందనీ వెల్లడించారు. డిజిటల్ పటిమ, వ్యవస్థా పక చురుకుదనం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సామర్థ్యాలను పొందుపరచడం ద్వారా, ఈ బడ్జెట్ స్థితిస్థాపక, ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు పునాది వేస్తుం దనీ.,. పెద్ద ఎత్తున మానవ మూలధన పరివర్తనకు ఉత్ప్రేరకంగా, ఆర్థిక పోటీత త్వం, ఉద్యోగ సృష్టి, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రతిభా పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తుందన్నారు. భారత దేశాన్ని నూతన యుగ శ్రామిక శక్తి విప్లవం లో ముందంజలో ఉంచుతుందని వివరిం చారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036